క్లుప్తంగా

వందశాతం పన్నులు వసూలు చేయాలి



డిచ్‌పల్లి: మార్చి నెలాఖరులోపు వంద శాతం పన్నులు వసూలు చేయాలని నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సకాలంలో పన్నులు వసూల చేసి పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడంతో పాటు కరెంట్ బిల్లులు కట్టాలని అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుధ్యం సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యదర్శి వినయ్, సిబ్బంది ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో మంగళవారం విప్లవ పార్టీల ఐక్యత మహసభల కరపత్రాలను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు బాబన్న మాట్లాడుతూ.. ఖమ్మంలో వచ్చే నెలలో నిర్వహిస్తున్న విప్లవ పార్టీల ఐక్యత మహసభలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. నాయకులు దామోదర్, రమేష్, సాయిలు, గంగాదాస్,నవీన్, చింటు, విష్ణు ఉన్నారు.

డిసెండింగ్ ఆర్డర్‌లో భర్తీ చేయాలి

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పోస్టులను డిసెండింగ్ ఆర్డర్‌లో (పైనుంచి కిందికి) భర్తీ చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లాకేంద్రంలో వారు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనీష్, నవీన్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ.. గురుకుల బోర్డు ఇష్టారీతిన నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. నాయకులు అషూర్, నికిల్, సాయి, కిరణ్, వర్ధన్ ఉన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి గ్రామంలో గల ఈత వనంలో కొన్ని చెట్లను తొలగించి గంగపుత్ర సంఘం సభ్యులు గంగమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారని గౌడ కులస్తులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ మాలతి, ఎక్సైజ్, ఇరిగేషన్ అధికారులు స్థలాన్ని పరిశీలించి సర్వే చేపట్టారు. గుడి నిర్మించాలంటే ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ గంగపుత్ర కులస్తులకు సూచించారు. ఈత చెట్లను నరికివేసిన ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవరావు తెలిపారు. ఆర్ఐ రవి, సర్వేయర్ గంగప్రసాద్, ఏఈ రాంప్రసాద్, ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్, ఎస్సై గోవర్ధన్ ఉన్నారు.

అర్గుల్‌లో నర్సరీ..

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీవో సతీష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులకు ఉపయోగపడే పండ్లు, పూల మొక్కలను నర్సరీలో పెంచుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. జీపీ కార్యదర్శి రాజేశ్వర్, ఏపీవో రవి ఉన్నారు.

నూతన చట్టాలపై సిక్కుల నిరసన



నిజామాబాద్‌నాగారం: మహారాష్ట్ర ప్రభుత్వం సిక్కులను అగౌరవ పరిచే విధంగా కొత్త చట్టాన్ని తీసుకవచ్చిందని, ఇది సరికాదంటు నగరంలో మంగళవారం సిక్కులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా తెలంగాణ సిక్కు సొసైటి జిల్లా కార్యదర్శి సర్దార్ నరేందర్ సింగ్ మాట్లాడుతూ.. 1956 చట్టం ప్రకారం 17మందితో సిక్కులకు సంబంధించి కమిటీ ఉందన్నారు. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా తీసుకువచ్చిన చట్టంలో నాందేడ్ నుంచి 12మందితో పాటు, ఇతరుల నుంచి 5మంది ఉండేలా రూపొందించరన్నారు. ఇది సిక్కుల 1956 చట్టానికి విరుద్ధమన్నారు. దీనిని వెంటనే రద్దు చేసి, యాధివిధిగా 1956 చట్టాన్ని అమలు చేయాలన్నారు. సొసైటీ ప్రతినిధులు సర్దార్‌పురణ్‌సింగ్, గురుమిత్‌సింగ్, మణిందర్‌సింగ్, భోళా సింగ్, చేర్‌సింగ్, జస్సబీర్‌సింగ్, రవీందర్ సింగ్, షేర్‌మజీత్ సింగ్, కేదార్‌సింగ్ ఉన్నారు.

22న సెపక్‌తక్రా జట్ల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలో ఈనెల 22న జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాలబాలికల జూనియర్, సబ్ జూనియర్ జట్ల ఎంపికలు ఉంటాయని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవేణు, గాధరి సంజీవ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయినా క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. సబ్ జూనియర్‌కు 1-1-2009 తరువాత జన్మించిన వారు, జూనియర్‌కు 1-1-2004 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఈ ఎంపికలు ప్రెసిడెన్సీ పాఠశాల మోపాల్‌లో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం 8985870006ను సంప్రదించాలన్నారు.



రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వీల్ బ్యారెల్స్

బండ్లు మరీ చెత్త

డ్రైయినేజీల్లోని చెత్తను మున్సిపల్ కార్మికులు బయటకు తీసిన తర్వాత వీల్ బ్యారెల్స్ (చెత్త ట్రాలీలు) సహాయంతో చెత్త వాహనంలోకి తరలిస్తారు. నగర మున్సిపల్ అధికారులు ఈ వీల్ బ్యారెల్స్ సప్లయ్‌ను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించగా, నాసిరకంగా తయారు చేయించారు. దీంతో అవి త్వరగా పాడైపోతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- వీల్ బ్యారెల్స్‌ను నాసిరకంగా తయారు చేసిన కాంట్రాక్టర్
- త్వరలో పంపిణీ చేయనున్న మున్సిపల్ అధికారులు
- నాణ్యతలోపంపై కార్మికుల అసహనం

మున్సిపల్ రిపోర్ట్

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో మరో నాసిరకం పనుల వ్యవహారం జరిగినట్లు తెలుస్తోంది. నగరంలోని ఆయా డివిజన్లలోగల మురుగునీటి కాలువల్లో చెత్తను మున్సిపల్ కార్మికులు బయటకు తీసిన తర్వాత వీల్ బ్యారెల్స్ ద్వారా తరలిస్తారు. నగరంలో వీటి కొరత ఉంది. దీంతో వీ ల్ బ్యారెల్స్ (చెత్త ట్రాలీలు) కోసం మున్సిపల్‌శాఖ అధికారుల అనుమతితో ఇంజనీరింగ్ సెక్షన్‌కు చెందిన అధికారులు ఆన్‌లైన్ టెండర్ పిలిచారు. ఓ కాంట్రాక్టర్ రూ.13లక్షలతో టెండర్‌ను ఇటీవలే దక్కించుకున్నారు. అయితే నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే తయారు చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచేశారు.

డివిజన్‌కు మూడు చొప్పన..



నిజామాబాద్ నగరంలో 60 డివిజన్‌లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌కు మూడు చొప్పున 180 వీల్ బ్యారెల్స్‌ను సిద్ధం చేశారు.

కానీ కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించకుండానే వీల్‌బ్యారెల్స్ తయారు చేయడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. కేవలం రేకులు పెట్టి తయారు చేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. గతంలో చాలా గట్టిగా బలంగా ఉండేవంటున్నారు. ప్రస్తుతం నాసిరకంగా ఉన్నాయని, కొద్దిరోజుల్లోనే దెబ్బతింటాయని కార్మికులు పేర్కొంటున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

శానిటేషన్‌కు సంబంధించిన అధికారులు ఇటీవల ఈ వీల్‌బ్యారెల్స్ పరిశీలన చేసి బాగా లేవని ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు తెలిపారు. దీంతో కొద్దిగా మార్పులు చేశారు. అయినా వీటిని చూస్తే నాసిరకంగానే ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది అధికారులు చేతివాటం ప్రదర్శించడంతోనే వీటినే పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచామని శానిటేషన్ అధికారులు పేర్కొంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే వీల్‌బ్యారెల్స్ ఉన్నాయని తెలిసినా పంపిణీ చేస్తారో? ఆపివేస్తారో వేచి చూడాలి మరీ. అధికారులు స్పందించి నాణ్యమైన వీల్ బ్యారెల్స్ అందించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.

బాగలేకుంటే పంపిణీ చేయం..

వీల్ బ్యారెల్స్‌ను శానిటేషన్ కోసం ఆన్‌లైన్ టెండర్ ద్వారా ఓ కాంట్రాక్టర్‌తో తయారు చేయించాం. వీటినీ ఇదివరకే శానిటేషన్ అధికారులు సైతం పరిశీలన చేశారు. ఇవి బాగా లేకపోతే పంపిణీ చేయం. నాసిరకం వీల్ బ్యారెల్స్ విషయం నా దృష్టికి రాలేదు. పూర్తి వివరాలు తెలుసుకుంటా.

– ఆనంద్‌సాగర్, ఇంజనీరింగ్ ఎంఈ, నిజామాబాద్

పరిశీలించాం..

డ్రెయినేజీల్లో నుంచి తీసిన చెత్తను తొలగించడానికి వీల్ బ్యారెల్స్ కోసం ఆన్‌లైన్ టెండర్ ద్వారా తీసుకున్నాం. అంతా ఇంజనీరింగ్ అధికారులకే తెలుసు. వీల్ బ్యారెల్స్ బాగా లేకుంటే పలు సూచనలు కూడా చేశాం. వీటిని మళ్లీ పరిశీలన చేసి నివేదిక ఇస్తాం.

– నటరాజ్, శానిటేషన్ మెటీరియల్ ఇన్‌చార్జి

ఎంపీ అహంకారంతోనే బీజేపీలో వ్యతిరేకత

ఖలీల్‌వాడి: ఎంపీ ధర్మపురి అర్వింద్ అహంకారంతోనే బీజేపీలో వ్యతిరేకత వచ్చిందని, దీనిని పక్కదారి పట్టించేందుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీగా అర్వింద్ గెలిచి ఐదేళ్లు అయినా చేసిందేమీ లేదని, మళ్లీ గెలిపిస్తే అసమర్థుడి చేతిలో తాకట్టుపెట్టినట్లవుతుందని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మచ్చలేని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, ఆకుల లలిత, కేశ వేణు, సంతోష్, సుమన్, శివ, బింగి మధుసూదన్, నర్సింగ్, గంగారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

బీసీల అభివృద్ధి కోసమే కులగణన

డిచ్‌పల్లి/సిరికొండ/ఖలీల్‌వాడి/ధర్పల్లి: బీసీల అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని, ఇందులో భాగంగానే బీసీ కులగణన చేపట్టిందని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజనరేందర్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణన చేపట్టాలని తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రుల ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అలాగే రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు 'కుల గణన'పై హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.



నగరంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నేతలు

ఘనంగా ధ్వజారోహణం

డిచ్‌పల్లి: జిల్లాలో ప్రసిద్ధి పొందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో సీతారామస్వామి తిరుక్కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే నేతృత్వంలో అర్చకులు అగ్నిప్రతిష్ట, బేరిపూజ, దేవతా ఆహ్వానం, సాయంత్రం నిత్య హోమం, బలిహరణం నిర్వహించారు. రాత్రి సీతారామస్వామి వారి ఉత్సవ విగ్రహాలను హనుమంతుని వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, గజవాడ జైపాల్, మాజీ సర్పంచ్ గడ్డం రాధ కిష్టారెడ్డి, బూస సుదర్శన్, గజవాడ రాములు, నర్సారెడ్డి, విజయ్‌నాథ్, పోశెట్టి, మాధురి, జితేందర్, సాయిలు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలి



నిజామాబాద్‌నాగారం : నగరంలో వ్యాపార వాణిజ్య సంస్థలు, గృహాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు అందరు తప్పకుండా చెల్లించాల్సిందేనని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. నగరంలోని శివాజీనగర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన, అధికారులు ఇంటింటికీ తిరుగుతూ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని కోరారు. ఆర్వో నరేందర్, ఆర్ఐలు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం



ఖలీల్‌వాడి: పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో మంగళవారం జిల్లా జడ్జితోపాటు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది బాస రాజేశ్వర్ వారి తల్లిదండ్రులు బాస పోశెట్టి లక్ష్మీబాయిల స్మారకార్థం కాటన్ క్లాత్‌తో రూపొందించిన హ్యాండ్ బ్యాగులను ఆవిష్కరించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు క్లాత్‌తో తయారు చేసిన బ్యాగులను, ఇతరాత్ర చిన్నచిన్న బ్యాగులను ప్రజలకు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు మంథని రాజేందర్‌రెడ్డి, ఆకుల రమేష్, నీలకంట రావు, గొర్రెపాటి మాధవరావు, శ్రీహరి ఆచార్య, కుమార్ దాస్, వెంకటేశ్వర్, భాస్కర్, మానిక్‌రాజ్, ఆశ నారాయణ ఉన్నారు.

సంక్షిప్తం

24న ధర్మబీజం

నిజామాబాద్ సిటీ: నగరంలోని పాత కలెక్టర్ క్రీడా మైదానంలో ఈ నెల 24న(శనివారం) ఎంపీ అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మబీజం(ఏక్ శామ్ శ్రీరామ్ కే నామ్) ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రవచనకారులు, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు, ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు కన్హయ మిట్టల్ హాజరు కానున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రవచనాలు, రాత్రి 8.30 గంటలకు భజన కార్యక్రమం జరుగనుంది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

ఇందల్వాయి: బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి, పలు బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కులాచారి దినేష్, నాయిడి రాజన్న, తిరుపతి రెడ్డి, కన్నె చిన్ను, బాబు శరత్, సత్యనారాయణ, మనోహర్ ఉన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం కాంగ్రెస్ సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ జన్మదిన వేడుకలను జిల్లా సేవాదళ్ ఆధర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేశారు. నాయకులు వైశ్కి సంతోష్, ఎండల కిషన్, మధు లింగన్న, కేశ రాజు, దిలీప్, రాము, అబిర్ పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



నిజామాబాద్ సిటీ: నగరంలోని కోటగల్లిలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయం ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మంగళవారం నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జెటి వెంకట నర్సయ్య, కమిటి సభ్యులు పలువురు ప్రజాప్రతినిధులను కలిశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ విప్ అనిల్, మాజీ ఎమ్మెల్యే రమణలను కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

సిరికొండ: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్ రాష్ట్రస్థాయి పోటీలలో మండలంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈసందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇటీవల హైద్రాబాద్‌లో లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ, ఆదాయ పన్ను శాఖ రాష్ట్ర కమిషనర్ జీవన్‌లాల్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ బహుమతులు అందజేశారు. విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్‌లోకి మరో ఇద్దరు కార్పొరేటర్లు

నిజామాబాద్ నాగారం: నగరంలోని మరో ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిసింది. నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన శివ చరణ్, పెద్ద బజార్ చెందిన కుద్దుస్ మంగళవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు తెలిసింది.



మూసిఉన్న పురావస్తు ప్రదర్శన శాల

నేటి చిత్రం..

మ్యూజియంపై నిర్లక్ష్యమేల?

నగరంలోని తిలక్‌గార్డెన్‌లో ఉన్న పురావస్తు ప్రదర్శనశాల(మ్యూజియం) అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారుతోంది. ఈ ప్రదర్శనశాలను నాలుగేళ్ల కిందట రూ.40 లక్షలతో ఆధునీకరించారు. కానీ ప్రారంభించకపోవడంతో ప్రస్తుతం మ్యూజియం శిథిలావస్థకు చేరింది. మ్యూజియం ఆలనాపాలన చూసేవారు లేక అందులోని పురాతన విగ్రహాలు, నైజాం కాలంలో వినియోగించి వివిధ సామగ్రి చీకటిలో మగ్గుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యూజియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నూతన కార్యవర్గం ఎన్నిక..

గిరిజన శక్తి కమిటీ..



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి విద్యార్థి సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీను రాథోడ్, ఉపాధ్యక్షుడిగా సంజయ్‌బట్టు, కార్యదర్శిగా సతీష్ ఎన్నికయ్యారు. సంఘ నాయకులు శివనాయక్, శ్రీకాంత్‌నాయక్, హరినాయక్, ప్రకాష్‌నాయక్, ఆకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మనం మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్..



నిజామాబాద్ సిటీ: నగరంలోని వినాయక్‌నగర్‌లో మంగళవారం మనం మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైంది. ఈసందర్భంగా నూతన కార్యవర్గంను సంఘ ప్రతినిధులు ఎన్నుకున్నారు. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ అర్జున్ రావు, ఆస్ట్రాలజీ జ్యోతిషరత్న అవార్డు గ్రహీత దుర్గామాత ఉపాసకులు శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ ఉమారాణిశ్రీనివాస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. అనంతరం మ్యారేజ్ బ్యూరో మీడియేటర్లకు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. జిల్లా చైర్మన్ గోవింద్ గంగాధర్, అధ్యక్షుడు కుమార్ నేత, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌గౌడ్, కోశాధికారి మోత్కూరి లాలేందర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం..



భాస్కర్



సుహాసిని

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటిలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మధు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సంయుక్తగా కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా కిరిటా సుహాసిని నియమించినట్లు తెలియజేశారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సవం



నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం కాలేజ్ వార్షికోత్సవం, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. ప్రిన్సిపల్ నుస్రత్ జహాన్, అధ్యాపకులు లావణ్య, శైలజ, రాజేశ్వర్, కల్పన పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

నేటినుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్‌లోగల ఆనందగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 26వరకు ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,150	వెండి (కిలో)	75,200
22 క్యారెట్స్	59,153	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	45	60
బెండకాయ	65	80	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	45	65	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	35	60	చిక్కుడుకాయ	35	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 1.40, 7.35, 10.30, హనుమాన్ (తెలుగు) 4.30
స్క్రీన్-2	ఈగల్ (తెలుగు) - 10.50, 10.30 మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) - 1.50, ఓయ్ (తెలుగు) 4.10, 7.20
స్క్రీన్-3	ఈగల్ (తెలుగు) - 1.30, 4.30,7.30 హనుమాన్ (తెలుగు) - 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) - 12.20, తేరి బాతోమే (హిందీ) 3.00, ఓయ్ 6.10 ఊరు పేరు భైరవకోన (తెలుగు) 9.40
స్క్రీన్-2	ఈగల్ - 12.00, 10.00 హనుమాన్ (హిందీ) 3.20, 6.40
స్క్రీన్-3	రాజధాని ఫైల్స్ (తెలుగు) - 1.00 మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) - 4.20, 10.05
స్క్రీన్-4	ప్రవీణ్ ఐపీఎస్ (తెలుగు) - 12.40, ఊరు పేరు భైరవకోన 4.20, మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) 7.20 తేరి బాతోమే (హిందీ), 10.00
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	అంబాజీపేట మ్యారేజి బ్యాండ్(తెలుగు)
లలితామహల్	ఈగల్ (తెలుగు)
విజయ్	లాల్‌సలామ్(తెలుగు) 11.15, 6.15 యాత్ర-2 (తెలుగు) 2.15, 9.15